ప్రజాశక్తి

మంగళవారం 28 ఫిబ్రవరి 2023

5

శ్రీకాకుళం



టోల్‌ప్లాజా కార్మికులను ఆదుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను మడపాలం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టోల్‌ప్లాజా కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజాలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదాయాన్ని జిల్లాలో సర్దుబాటు చేసిన అధికారులు 60 మంది కార్మికులను మాత్రం అనకాపల్లి, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పడం అన్యాయమన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డి.వి నర్సింహులు, వి.వెంకటరమణ, ఎ.వి.ఆర్ మూర్తి, టి.అప్పారావు, పి.రాము, బి.శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి షాక్



రామారావు

- స్థానిక ఎమ్మెల్సీ బరిలో స్వతంత్ర అభ్యర్థి
- బెడిసికొట్టిన ఏకగ్రీవ ప్రయత్నాలు
- ఎన్నికను ఎదుర్కోవాల్సిన పరిస్థితి
- నేడు వైసిపి అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దశలో వైసిపికి షాక్ తగిలింది. తమకు పోటీయే ఉండదనుకున్న చోట ఎన్నికను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. స్వతంత్ర అభ్యర్థి రూపంలో వారికి పోటీ ఎదురైంది. సోమవారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ ముగిసే నాటికి ఇద్దరు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అభ్యర్థుల పోటీ జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపారు. వైసిపి తరుపున నర్తు రామారావు పోటీ పడుతుండగా, స్వతంత్ర అభ్యర్థిగా బూర్జ జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆనెపు రామకృష్ణ పోటీలో ఉన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటుకు ఇద్దరు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండడంతో ఎన్నిక అనివార్యంగా మారింది. ఎన్నిక లేకుండా సీటును ఏకగ్రీవం చేసుకునేందుకు వైసిపి పెద్దలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. టిడిపి తరుపున ఎవరూ పోటీ చేయకపోయినా, స్వతంత్ర అభ్యర్థి రూపంలో వారికి పోటీ ఎదురైంది. ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్, తూర్పు కాపు సంక్షేమ సంఘం తదితర సంఘాల తరుపున ఆయన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ఉపసంహరణకు అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. రామకృష్ణకు స్వయంగా ఫోన్ చేసి తప్పుకోవాలని సుతిమెత్తగా కోరారు. ఈనెల 25 వరకు అనేక రకాలుగా ఒత్తిళ్లు చేశారు. మరో మూడు రోజులు గడువు ఉండడంతో వైసిపి పెద్దలు ఏదోరకంగా ఉపసంహరించేలా చేస్తారని అంతా భావించారు. ఈ పరిస్థితులను ముందే ఊహించిన ఆనెపు రామకృష్ణ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. దీంతో వైసిపి పెద్దలు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఈ అంశంపై అధిష్టానానికి ఏం సమాధానం చెప్పుకోవాలో తెలియక కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు తెలిసింది.

నేడు వైసిపి అత్యవసర సమావేశం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు అనివార్యం కావడంతో, పరిస్థితులను ఎదుర్కోవడానికి శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఆనందమయి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం అత్యవసరంగా సమావేశం కావాలని నిర్ణయించింది. సమావేశానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పార్టీ నుంచి గెలుపొందిన జెడ్‌పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లను ఆహ్వానించారు. ప్రధానంగా ఎమ్మెల్సీ ఎన్నికపైనే దిశానిర్దేశం చేయనున్నారని తెలిసింది.

పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారిన ఎన్నిక

ఎమ్మెల్సీ ఎన్నిక జిల్లా వైసిపి పెద్దలకు తలనొప్పిగా మారింది. సీటు ఏకగ్రీవమై ఉంటే ఎటువంటి హైరానా లేకుండానే ఎన్నిక ప్రక్రియ ముగిసేది. ఇప్పుడు పోటీ నెలకొనడంతో నియోజకవర్గ స్థాయిలో ప్రచారం, ఓటర్ల సమావేశాలు వంటి కార్యక్రమాల బాధ్యతలను ఎమ్మెల్యేలే చూడాల్సి ఉంటుంది. జిల్లా మొత్తం బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ చూడాల్సి ఉంటుంది.



రామకృష్ణ

వైసిపికి ఇబ్బందికరమే

జిల్లాలో వచ్చే నెల మార్చి 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. అదే రోజు స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి పోలింగ్ జరుగనుంది. ఒకవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం, మరోవైపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గెలుపు కోసం పనిచేయాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం చేసుకుని, పట్టభద్రుల ఎమ్మెల్సీపై పూర్తిగా దృష్టిసారిద్దామని భావించిన పార్టీ నేతలకు ఇప్పుడు రెండు పనులు ఒకేసారి కావడంతో కొంత ఇబ్బందికరంగా మారనుంది.

పైసా ఖర్చు లేకుండా ఎన్నిక కావాల్సి ఉన్నా...

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామరావు పోటీ ఎదుర్కోవాల్సి రావడం ఊహించని పరిణామమే. వైసిపికి 90 శాతానికి పైగా ఓట్లు ఉండడంతో టిడిపి పోటీ చేసే అవకాశం లేదు కాబట్టి ఏకగ్రీవంగా ఎన్నికవుతామని భావించిన ఆయనకు వ్యక్తిగతంగా షాక్ తగిలినట్టే. ఎన్నికను ఎదుర్కోవాల్సి రావడంతో ప్రతి మండలంలో ఓటర్లను కలుసుకోవాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పర్యటన చేయాల్సి ఉంటుంది. పైసా ఖర్చు లేకుండా ఎన్నిక కావాల్సిన రామారావుకు ఎన్నికల కోసం భారీగా డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఎలిఫెంట్ ట్రాకర్ మృతిపై విచారణ

ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్‌కు జాతీయ ఎస్‌టి కమిషన్ సమన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగుల జాడను కనుగొనే ఎలిఫెంట్ ట్రాకర్ల మృతి సంఘటనలను జాతీయ ఎస్‌టి కమిషన్ సుమోటోగా స్వీకరించి, కేసు నమోదు చేసింది. దీనిపై వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ వై.మధుసూదనరెడ్డిని ఆదేశించింది. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాల్లో భాగంగా ఉన్న పార్వతీపురం, సీతంపేట ఏజెన్సీ ప్రాంతాల్లో ఏనుగుల బెడద తీవ్రంగా ఉంది. అవి పంటలు, గ్రామీణులపై దాడులు చేస్తూ ఆస్తి, ప్రాణనష్టం కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఏనుగుల గుంపు జాడను కనుగొని వాటిని దూరంగా తరమడంతో పాటు సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు గిరిజనులను ట్రాకర్లుగా నియమిస్తోంది. ఏనుగుల దాడుల్లో ట్రాకర్లు కూడా మృతి చెందుతున్నారు. అదే క్రమంలో ట్రాకర్‌గా పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం సవర తిడ్డిమి గ్రామానికి చెందిన లోకొండ లక్ష్మీనారాయణ ఏనుగుల దాడిలో ఈనెల ఆరో తేదీన మృతి చెందాడు. భామిని మండలం పసుకుడి వద్ద జరిగిన ఈ దుర్ఘటనపై ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. అందులో భాగంగా మొదట ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ మధుసూదనరెడ్డితో పాటు శ్రీకాకుళం జిలా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎస్‌టి కమిషన్ ఆదేశించింది. తాజాగా ఈ ఘటనపై విచారణకు స్వయంగా ఢిల్లీలోని జాతీయ ఎస్‌టి కమిషన్ కార్యాలయానికి వచ్చి కమిషన్ సభ్యుడు అనంత నాయక్ ఎదుట హాజరు కావాలని కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

4 నుంచి ప్రజ్ఞా వికాస పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు పదోతరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, హరీష్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో పరీక్షల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు బహుళ ఐచ్చిక ప్రశ్నల రూపంలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులందరూ పాల్గొనాలని కోరారు. పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, విద్యారంగ అభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలను సూచిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చందు, టౌన్ గర్ల్స్ కన్వీనర్ స్వర్ణకుమారి, కమిటీ సభ్యులు వందన, భరణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బరిలో 37 మంది

- పట్టభద్రుల శాసన మండలి స్థానానికి ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి పోటీలో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. తన కార్యాలయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గానికి సంబంధించి పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలపై ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొడ్డేడ చంద్రకళ పద్మావతి, ఈర్ల శ్రీరామ్మూర్తి, గూనూరు మళ్ళనాయుడు పోటీ నుంచి ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 331 పోలింగు కేంద్రాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 59, విజయనగరంలో 72, పార్వతీపురం మన్యంలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 15, విశాఖపట్నంలో 112, అనకాపల్లిలో 49 పోలింగు కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. పోలింగు సిబ్బందికి ఈ నెల 28న, తిరిగి రెండో సారి మార్చి 7న శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బూత్ స్థాయి అధికారులతో ఓటరుకు స్లిప్పులు, ఓటరుకు సంబంధించిన సమాచారం అందిస్తారని, ఆబ్సెంటీ, షిఫ్టెడ్, డూప్లికేట్ ఓటరు జాబితాను ప్రెసైడింగ్ ఆఫీసర్లకు మెటీరియల్‌తో అందజేస్తామని తెలిపారు.

ఓటర్లు ఇలా..

ఉత్తరాంధ్ర పట్టభద్రులకు సంబంధించి 2,89,214 ఓట్లు ఉండగా శ్రీకాకుళం జిల్లాలో 52256 మంది, విజయనగరం జిల్లాలో 58502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11525 మంది, విశాఖపట్నం జిల్లాలో 105697 మంది, అనకాపల్లి జిల్లాలో 42714 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎన్నికలకు సంబంధించి విశాఖపట్నం జిల్లాలో 15 మంది సెక్టార్/జోనల్ ఆఫీసర్లు, 15 మంది రూటు ఆఫీసర్లు, 112 మంది బూత్ స్థాయి ఆఫీసర్లు, 143 మంది ప్రెసైడింగ్ ఆఫీసర్లు, 443 మంది ఇతర పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సూక్ష్మ పరిశీలకులు, 112 వెబ్ కాస్టింగ్ వెబ్ కెమెరాలు (అన్ని పోలింగు కేంద్రాలలో), ఒక మండలానికి 11 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆరు జిల్లాల్లో సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అభ్యర్థుల పేర్లు ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పెట్టి ఎన్నికల కమిషన్ పరిశీలనకు పంపించామన్నారు.

పోలింగ్ సమయం

పోలింగు మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని, 4 గంటల తర్వాత వరుసలో ఉన్న వారిని వీడియో తీసి వారికి టోకెన్లు అందిస్తారని, వారు మాత్రమే ఓటు వేస్తారని తెలిపారు. పోలింగు పూర్తయిన తరువాత సంబంధిత స్ట్రాంగ్ రూంలలో భద్రపరుస్తారని, మరుసటి రోజున పోలీసు బందోబస్తుతో ఆయా జిల్లాల నుంచి తీసుకువచ్చి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారని తెలిపారు. మార్చి 16న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపునకు 28 లెక్కింపు టేబుల్స్, ఒక రిటర్నింగ్ అధికారి టేబుల్ సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రారంభమవుతుందని వివరించారు. వీడియోగ్రఫీ సమక్షంలో లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు వ్యక్తిగత దూషణలకు పోరాదని అన్నారు. ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఆయన ఇంటినిగానీ, ఇంటి ఆవరణాన్నిగానీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని తెలిపారు. పోలింగు కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ప్రచారం నిషిద్ధమని, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలని అన్నారు. పోలింగు కేంద్రాలకు పోలింగు ఏజెంట్లుగా ఒకరిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు.

పోలీసు బందోబస్తు

నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించి పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 1162 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగు రోజున 840 మందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. 112 పోలింగు స్టేషన్లు, 43 పోలింగు లోకేషన్లు, 15 రూటు మొబైల్స్, ప్రతి పోలింగు స్టేషన్ వద్ద అక్కడ ఉన్న సమస్యల ఆధారంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్, స్ట్రైకింగ్ ఫోర్సెస్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రిజర్వ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికలు పూర్తయిన తరువాత స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద, స్ట్రాంగ్ రూం వద్ద సెంట్రల్ పారామిలటరీ ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. లెక్కింపు రోజున పారామిలటరీ దళాలను అందుబాటులో ఉంచుతామన్నారు. తొలుత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తెలియజేశారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.



రాగి మాల్ట్‌ను తాగుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. చిరుధాన్యాల ఆహార పండుగ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యాన జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్ద చిరుధాన్యాల ఆహార ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుదారులకు, జిల్లా అధికారులకు చిరుధాన్యాలతో తయారు చేసిన జావను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో చిరుధాన్యాల ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్నారు. చిరుధాన్యాల్లో పోషకాలను గుర్తించి అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. చిరుధాన్యాలలో లభించే పోషకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. వాటి విలువను ప్రజలకు వివరించాడనికే ఇలాంటి కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారి అనంతలక్ష్మి, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు గడ్డెమ్మ, జిల్లా కో-ఆర్డినేటర్ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వెల్ఫేర్ బోర్డు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - విజయనగరం

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. విజయనగరంలోని పలు విద్యాసంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులను సోమవారం కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల తరపున శాసనమండలిలో పోరాడుతున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. అటువంటి ఫ్రంట్ తనను బలపరచడం గర్వకారణమన్నారు. ఇప్పటివరకు సామాజిక సమస్యలపై పోరాడానని, పట్టభద్రులు అవకాశం కల్పిస్తే చట్టసభలో ఉత్తరాంధ్ర అభివృద్ధి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రయివేట్ విద్యాసంస్థల సిబ్బంది హక్కుల కోసం పనిచేస్తానని చెప్పారు. వారందరికీ గుర్తింపు కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ప్రజల గొంతుకనై పనిచేస్తానని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసే గెలిపించాలని ఆమె కోరారు.

కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటేష్, పి.రామ్మోహన్, నాయకులు పావని, రామకృష్ణ, లావణ్య, సంధ్య, బాలాజీ, సోమేశ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రయివేటు ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

భర్త అడ్డు తొలగించేందుకే!

- ప్రియునితో కలిసి భర్త హత్యకు స్కెచ్
- మందు పార్టీకి పిలిచి కొట్టి చంపిన ప్రియుడు

ప్రజాశక్తి - రణస్థలం

వారిద్దరి మధ్య భర్త అడ్డం వస్తున్నాడని భావించింది. ఇంకే ముంది ప్రియునితో కలిసి మరణ శాసనం రాసింది. పథకం ప్రకారం ప్రియుడు తన ఇద్దరు స్నేహితులతో కలిసి ప్రియురాలి భర్తను మందు పార్టీకి పిలిచాడు. 'నువ్వు నా కంటే ఎక్కువ తాగగలవా? నీ కెపాసిటీ ఏమిటో చూస్తాన'ని ప్రేరేపించాడు. మద్యం అధికంగా తాగి, మత్తులో ఉండగా ఇష్టానుసారంగా కొట్టి చంపేశారు. అది హత్య కాదు.. సహజ మరణహని నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ ఘటన వరిశాంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..



జీరు బాలకృష్ణ (ఫైల్)

పైడిభీమవరం పంచాయతీ వరిశాం గ్రామానికి చెందిన జీరు బాలకృష్ణ(33)కు అదే మండలం మెంటాడకు చెందిన సునీతతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. బాలకృష్ణ పేయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వరిశాంకు చెందిన కంబాల వెంకటరమణతో రెండేళ్ల క్రితం సునీతకు పరిచయమైంది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. వారు ఏకాంతంగా గడిపేందుకు భర్త బాలకృష్ణ అడ్డం వస్తున్నాడని ఆమె భావించింది. ప్రియుడు వెంకటరమణతో కలిసి భర్త అడ్డు తొలగించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా వెంకటరమణ తన స్నేహితులు రాము, పైడిభీమవరానికి చెందిన కరణపు దుర్గాప్రసాద్‌ను ఆదివారం రాత్రి మందు పార్టీకి పిలిచాడు. గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న సచివాలయం వద్దకు మందు పార్టీకి బాలకృష్ణను కూడా తీసుకెళ్లారు. వెంకటరమణ పథకం ప్రకారం బాలకృష్ణను రెచ్చగొట్టాడు. ఆయన మద్యం అధికంగా సేవించి, మత్తులో ఉండగా తన ఇద్దరు స్నేహితులతో కలిసి గుండె, చేతులపై కొట్టి చంపేశారు. బాలకృష్ణ చనిపోయాడని నిర్ధారించుకున్నాక ఈ నేరం తమపైకి రాకుండా ఉండేందుకు సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. గ్రామంలోని రచ్చబండ వద్ద బాలకృష్ణ మృతదేహాన్ని పడేసి, అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఆధారాలు సేకరించిన పోలీసులు

సోమవారం ఉదయం రచ్చబండ వద్ద బాలకృష్ణ మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందించారు. సిఐ ఎస్.ఆదాం, ఎస్ఐ జి.రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆనంతరం శ్రీకాకుళం డిఎస్‌పి మహేంద్ర, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటివరకు అక్కడే ఉన్న నిందితులు దొరికిపోతామని భయపడి పరారయ్యారు.



మృతదేహం వద్ద డాగ్ స్క్వాడ్

ఇలా దొరికిపోయారు

హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి గస్తీ కాస్తున్న పోలీసులకు నిందితులు ముగ్గురూ తారసపడ్డారు. పొంతన లేని సమాధానం ఇచ్చిన వారి వివరాలు, ఫొటోను పోలీసులు తీసుకుని విడిచిపెట్టారు. సోమవారం హత్య జరగడంతో నిందితులు వీరై ఉండొచ్చన్న సందేహంతో వారిని పోలీసులు పట్టుకున్నారు. దీంతో జరిగిన విషయాన్ని వారు పోలీసుల వద్ద చెప్పి, నేరం అంగీకరించారు.

అనాథలైన పిల్లలు

బాలకృష్ణకు భాగ్యశ్రీ, రమ్యశ్రీ పిల్లలున్నారు. బాలకృష్ణ హత్యకు గురయ్యాడు. సునీత హత్య కేసులో చిక్కుకుంది. దీంతో ఇద్దరు పిల్లలు అనాధలయ్యారు. మృతుని అన్నయ్య జీరు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు నిందుతులతో పాటు, మృతుని భార్య సునీతపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో విషాదం నెలకొంది.

మానని గాయం

- కాకరాపల్లి పోలీసు కాల్పులకు 12 ఏళ్లు
- థర్మల్ ప్లాంట్ జిఒను రద్దు చేస్తామని సిఎం జగన్ హామీ
- నేటికీ రద్దు కాని జిఒ నంబరు 1108
- 4,585 రోజులుగా కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి - నౌపడ

బతుకును బుగ్గి చేసే, జీవనాధారాన్ని దెబ్బతీసే ఈస్ట్‌కోస్ట్ థర్మల్ పవర్‌ప్లాంట్‌ను వ్యతిరేకించడమే వారు చేసిన నేరమైంది. పచ్చని తంపర భూముల్లో పవర్‌ప్లాంట్ వద్దని పోరాడిన రైతులు, మత్స్యకారులపై పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి తూటాల వర్షం కురిపించారు. ముగ్గురిని బలిగొన్న, వందల మంది క్షతగాత్రులైన ఈ ఘటనకు నేటికి పుష్కర కాలమైంది. నాటి దమనకాండ నేటికీ ఆ ప్రాంత ప్రజల కళ్లెదుట కదలాడుతూనే ఉంది. మరోవైపు అధికారంలోకొస్తే ఈ ప్లాంట్‌ను రద్దు చేస్తామని ప్రతిపక్ష నేతలుగా చంద్రబాబునాయుడు, జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆ హామీ అమలు జాడే లేకపోగా, వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు దాటినా ఊసే లేకుండా పోయింది. ప్లాంట్‌కు సంబంధించిన 1108 జిఒను రద్దు చేయాలని స్థానికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 4,585 రోజులుగా కొనసాగుతున్నాయి.

సంతబొమ్మాళి మండలంలోని కాకరాపల్లి వద్ద 2,640 మెగావాట్ల ఈస్ట్‌కోస్ట్ థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుతో పర్యావరణానికి హానితో పాటు తమ ఉపాధికి ముప్పు వాటిల్లనుండడంతో స్వదేశీ మత్స్యకారులు, రైతులు, యువత, ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఎన్నో తరాలుగా తంపర భూములను నమ్ముకుని బతుకుతున్న అక్కడి మత్స్యకారులు, రైతులు విద్యుత్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమానికి సిద్ధమయ్యారు. వడ్డితాండ్రలో 2010 ఆగస్టు 15వ తేదీన చేపట్టిన రిలే నిరాహార దీక్షలను అప్పటి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ ప్రారంభించారు. దీక్షలకు ప్రజాసంఘాలు, పలు పార్టీలు సంఘీభావం తెలిపాయి. పోరాటంలో భాగంగా 2011 ఫిబ్రవరి 25న పవర్‌ప్లాంట్ వాహనాలను ఉద్యమకారులు అడ్డుకున్నారు. దీంతో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. దీక్షా శిబిరాన్ని పోలీసులు బలవంతంగా తొలగించి, పలువురిని అరెస్టు చేశారు. యువకులు, వృద్ధులు, మహిళలన్న తేడా లేకుండా హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు. 2011 ఫిబ్రవరి 28న పోతునాయుడుపేట కూడలి వద్ద మత్స్యకారులు, రైతులు, స్థానికులు, పోలీసుల మధ్య దారితీసిన ఉద్రిక్త పరిస్థితులు రణరంగంగా మారాయి. పోలీసులు ఉద్యమకారులపై జరిపిన కాల్పుల్లో జీరు నాగేశ్వరరావు, సీరపు ఎర్రయ్య అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బత్తిని బారికయ్య పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందాడు. వందల మంది ప్రజలు క్షతగాత్రులయ్యారు. పదుల సంఖ్యలో ప్రజలను బంధించి జైలులో నిర్బంధించారు. ఇప్పటికీ ప్రభుత్వం పెట్టిన నాలుగు కేసుల్లో ఉద్యమకారులు తిరుగుతున్నారు.



కాకరాపల్లి అమరవీరుల స్థూపం



దీక్షల్లో పాల్గొన్న మహిళా ఉద్యమకారులు

మాట తప్పిన ప్రభుత్వాలు

ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కాల్పుల ఘటనపై ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ప్రజలకు కీడు చేసే పరిశ్రమలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల వ్యతిరేకిస్తున్నా ప్లాంట్ నిర్మాణం చేపట్టడం తగదని, తాము అధికారంలోకి రాగానే ఈస్ట్‌కోస్ట్ పవర్‌ప్లాంట్‌కు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తామని హామీనిచ్చారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఆ హామీని అటకెక్కించింది. 2018 డిసెంబరు 21వ తేదీన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా వడ్డితాండ్రలోని దీక్షా శిబిరాన్ని అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సందర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 1108 జిఒను రద్దు చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం జిఒను రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. ఉద్యమకారులపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిఒ రద్దు వరకూ పోరాటం కొనసాగిస్తామని ఉద్యమకారులు స్పష్టం చేస్తున్నారు.

జాతీయ సైన్స్‌కు కొత్తపేట ప్రాజెక్టు


ప్రాజెక్టును తయారు చేసిన ఢిల్లీశ్వరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వర్షాకాలం పట్టణ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. వర్షపు నీటితో నిండిన ప్రాంతంలో మ్యాన్‌హోల్ గుర్తించడం కష్ట సాధ్యమవుతోంది. అయితే ఆ సమయంలో మ్యాన్‌హోల్ ఎక్కడుందో గుర్తించ గలిగితే ప్రమాదాలను నివారించవచ్చని ఆలోచనతో మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి బొడిగి ఢిల్లేశ్వరరావు ప్రయోగాన్ని ఆవిష్కరించాడు. ఈ నెల 22న నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో దీనిని ఆవిష్కరించి అందరి ప్రశంసలందుకున్నాడు. అమరావతిలో మంగళవారం నిర్వహించనున్న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ పరికరాన్ని ఆవిష్కరించనున్నాడు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఎ.రవికుమార్ ప్రోత్సాహంతోనే దీన్ని రూపొందించగలిగానని విద్యార్థి ఢిల్లేశ్వరరావు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొదలవలస లక్ష్మణరావుతో పాటు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

ఏప్రిల్ 9 నుంచి తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు


అమ్మోజీ

ప్రజాశక్తి- రణస్థలం

శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, చేజర్ల ఇంద్రాణి ట్రస్టు చైర్మన్ కింగ్ ఇంద్ర సంయుక్తంగా ఏప్రిల్ 9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నారని సంస్థ మీడియా ప్రతినిధి అమ్మోజీ బమ్మిడి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్విరామంగా 48 గంటలు సాగే కళా ప్రదర్శనలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. పాల్గొన్న కళాకారులందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. పలు ప్రపంచ రికార్డుల్లో నమోదవుతున్న కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే కళాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితం అని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న దలచిన వారు 8247519925 సెల్ నంబరుకు, వాట్సప్‌కు చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. ప్రోగ్రాం మీడియా ప్రతినిధిగా అమ్మోజీని, ప్రోగ్రాం కన్వీనర్‌గా గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, ఆర్గనైజర్‌గా కొల్లి రమావతిని నియమిస్తూ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. టెక్కలి మండలం పోలవరానికి చెందిన అమ్మోజి రణస్థలం మండలంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు.


శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరాటేలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కరాటేలో హరిశ్చంద్రపురం ఉన్నత పాఠశాల ఐదో తరగతి విద్యార్థి కూటికుప్పల శ్యామ్‌కుమార్ ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయులు నూక లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విశాఖపట్నంలో ఎన్ఎస్‌కెఎన్ జాతీయ కరాటే సంస్థ నిర్వహించిన సౌత్ ఇండియా పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకున్నాడన్నారు. తదుపరి గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడని ఆయన తెలిపారు. శ్యామ్‌కుమార్ ప్రతిభ సాధించడంపై సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపిటిసి పూజారి సత్యం, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొల్ల తులసమ్మ, పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

యుబి కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు

- కలెక్టర్‌ను కోరిన యుబి వర్కర్స్ యూనియన్
- 'స్పందన'కు 173 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రణస్థలం మండలంలోని యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ కార్మికులందరికీ పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 173 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ నవ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్‌తో కలిసి కలెక్టర్ వినతులను స్వీకరించారు. పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, వికలాంగుల, వైద్యారోగ్య, విద్యాశాఖ, మున్సిపాలిటీ, రెవెన్యూ, సమగ్ర శిక్ష, పంచాయతీరాజ్ తదితర శాఖల సమస్యలపై వినతులు వచ్చాయి. యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ యాజమాన్యం 600 మంది కార్మికులకు 2019 నవంబరు నుంచి పూర్తిస్థాయి పనిదినాలు ఇవ్వకుండా నెలకు 12 నుంచి 16 పనిదినాలు మాత్రమే కల్పిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు చెల్లించలేక కార్మిక కుటుంబాల జీవనం కష్టంగా మారిందన్నారు.

యుబి కార్మికులకు పని దినాలు తగ్గిపోవడంతో ఇఎస్ఐ వైద్యానికీ అర్హత కోల్పోయారని చెప్పారు. జెసిఎల్ నిర్వహించిన సంయుక్త సమావేశంలో కార్మికులందరికీ 26 రోజులు పని కల్పించాలని, లేకుంటే 50 శాతం వేతనాలు చెల్లించాలని, చట్టబద్ధమైన అంశాలు అమలు చేయమని యాజమాన్యాన్ని ఆదేశించినా నేటికీ అమలు చేయడం లేదని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ అధ్యక్షులు ఇజ్జు నారాయణరావు, నాయకులు తోట వెంకటరమణ, కలిశెట్టి రమణ ఉన్నారు. టెక్కలి మండలం లింగాలవలసలో మాజీ సైనికోద్యోగి భూములను స్థానిక నాయకులు ఆక్రమించుకున్నారని, ఆ భూములు ఇప్పించాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు వెళ్తే దాడికి ప్రయత్నించారని ఫిర్యాదు చేశారు. జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో, పంట అమ్ముకోలేని దుస్థితి నెలకొందని నరసన్నపేట మండలం తెలగవాడకు చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఆయూబ్ ఖాన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వక్ఫ్ బోర్డ్ ఆస్తులు అక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్, సలహాదారులు అయూబ్ ఖాన్ తెలిపారు. పట్టణంలోని కస్పా, తురక వీధుల్లో ఉన్న ముస్లీం కళ్యాణ మండపంలో స్థానిక ముస్లీం పెద్దలు, యువతతో సోమవారం సమావేశం నిర్వహించారు. జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయుబ్ ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో ఇచ్ఛాపురంలో వక్ఫ్ బోర్డ్ ఆస్తులు ఆక్రమణలపై జరుగుతున్న వివాదాలపై ముస్లీం పెద్దలు, జిల్లా మంత్రులు, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వక్ఫ్‌బోర్డ్ ఆస్తుల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానిక యువత కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయిబ్ ఖాన్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.. అందరూ కలిసి గట్టిగా ఉంటే సమస్యలు ఉండవని అన్నారు. ముస్లిం, మైనారిటీ సంక్షేమానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. జోహర్ ఖాన్, మహ్మద్ యూసుఫ్, యస్ కె.రహిమాన్, మున్సిపల్ కో-అప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, అమీర్ ఆలీ, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌కోర్ అల్లాయిస్ కార్మికుల ధర్నా


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని రావివలస గ్రామం వద్ద ఉన్న మెట్‌కోర్ అల్లాయిస్ పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో పరిశ్రమ మూతబడిందని, మరలా తెరిచినప్పటికీ కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు రాలేదని అన్నారు. కార్మికులకు ఇపిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యం లేదన్నారు. స్థానికులకు ఉపాధీ అవకాశాలు చూపాలని, కారణం లేకుండా కార్మికులను ఆక్రమంగా తొలగిస్తున్నారని అన్నారు. దశాబ్దాల కాలం నుంచి పని చేస్తున్న కార్మికులపై వివక్షత చూపుతున్నారని అన్నారు. బకాయిలు చెల్లించమని కోరితే భయాందోళనలకి గురిచేస్తున్నారని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పన లేదన్నారు. వీటిపై సంబందిత అధికారులు దృష్టి సారించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు త్రివేణీ, మహలక్ష్మి, రామ్మూర్తి, రామారావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

పోలాకి: ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను సచివాలయంలోని ప్రజలకు కనిపించేలా నోటీసు బోర్డులో పెట్టాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు సచివాలయం సిబ్బందికి సూచించారు. సోమవారం పోలాకి, కొత్తరేవు, రాళ్లపాడు, గుప్పిడిపేట, రెహమాన్‌పురం, గాతలవలస, ఈదులవలస సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆధార్ కేంద్రాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన సమయంలో ఆధార్ కార్డు నమోదులో తప్పులుంటే సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఎమ్మెల్సీ ఎన్నికలే సెమీఫైనల్స్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- టెక్కలి

ఎమ్మెల్సీ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికలు రిఫరెండం అని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలో వచ్చిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని విమర్శించారు. ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గ్రామాల్లో కరుడుగట్టిన వైసిపి నాయకులు, కార్యకర్తలూ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధిలో 35 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. సమావేశంలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిని పరిచయం చేశారు. సమావేశంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష, చౌదరి నారాయణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ సైనిక్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక

టెక్కలి రూరల్ : కోరుకొండ సైనిక స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి పొన్నాడ గౌతమి ఎంపికైంది. జనవరి 8వ తేదీన ప్రభుత్వం నిర్వహించిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు స్థానిక మదర్ థెరిసా స్కూల్‌లో చదువుకుంది. అమర్‌నాథ్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందింది. విద్యార్థిని తండ్రి నిరంజన్‌రావు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా, తల్లి శాంతి సాధన గృహిణి, గౌతమి ఎంపికపై కోచింగ్ సెంటర్ అధ్యాపకులు సునీల్, తదితరులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇఒ మృతి


యోగేశ్వరరావు (ఫైల్)

కోటబొమ్మాళి: జాతీయ రహదారి కిష్టుపురం కూడలి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మేజరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రఘుపాత్రిని యోగేశ్వరరావు మృతి చెందాడు. ఆయన ఆదివారం సాయంత్రం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీతో పాటు పలు చోట్ల విధులు నిర్వహించి, ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన ఆయనను 108 సహాయంతో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయన మృతికి సర్పంచ్ కాళ్ల సంజీవరావు సంతాపం తెలిపారు.

వృద్ధుడు...

జాతీయ రహదారి సుబ్బారావుపేట సమీపంలో అదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సుబ్బారావుపేట వద్ద వృద్ధుడు రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన కింజరాపు రమేష్ తన ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు గాయాలు అయ్యాయి. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరుకు లారీ బోల్తా

రణస్థలం: జె.ఆర్.పురం పోలీసు స్టేషన్ పరిధిలోని నక్కలపేట కూడలిలో సోమవారం చెరకు లోడుతో లారీ బోల్తా పడింది. మండలంలోని తెప్పలవలస నుంచి సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు చెరకు లోడుతో లారీ వస్తుంది. ఒక్కసారిగా చెరుకు లోడు ఒరిగిపోవడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీ బోల్తా పడిన పక్కన హెచ్‌టి విద్యుత్ లైన్ ఉంది. అయితే విద్యుత్ వైర్లకు, స్తంభానికి తగలకుండా లారీ బోల్తా పడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీ చక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ నిర్వహించే ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవ, గ్రామ పురవీధుల పల్లకి సేవలో ప్రజలు పాల్గొంటున్నారు. ఆదివారం రాత్రి సోంపేటకు చెందిన శ్రీ నటరాజ నాట్య మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్య ప్రదర్శన నభూతో నభవిష్యత్ అనిపించింది. నాట్య మయూరి బిందు నేతత్వంలో చిన్నారులు ఇచ్చిన ప్రదర్శన ఆహూతులను కట్టిపడేసింది. అంతకుముందు గ్రామపెద్ద బార్ల ధనంజయ సేవలు గుర్తిస్తూ గ్రామస్తులు, పెద్దలు ఘనంగా సత్కరించారు. ఆర్‌డిఒ తమరాల సీతారామ్మూర్తి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పి.కృష్ణారావు, పి.రాంబాబు, పి.విజయకృష్ణ, సర్పంచ్ ఎస్‌వి నారాయణస్వామి, ఎఒ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఒబిసి గణన చేపట్టాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దేశంలో ఒబిసి కుల గణన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. పేరుకు మాత్రమే 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని చెప్పి ప్రాతినిధ్యంలో మాత్రం 15 శాతానికి మించడం లేదన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు అగ్ర కులాలకే కట్టబెడుతున్నారని చెప్పారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ లేని సామాజిక తరగతి బిసిలేనని, ఇడబ్ల్యుఎస్‌లో ఉన్న వారి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. బిసిలు ఎక్కువ మంది ఉన్నా తక్కువ శాతం రిజర్వేషన్ ఉందన్నారు. జాతీయ జనగణనలో భాగంగా బిసి కులాల గణన చేపట్టాలని ఎంత మొత్తుకున్నా కేంద్రానికి చెవికెక్కడం లేదన్నారు. దేశంలో రిజర్వేషన్లు పొందుతున్న ఏ సామాజిక తరగతికీ లేని క్రిమిలేయర్ ఒక్క బిసిల పైనే అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎఎస్, ఐపిఎస్‌ల మాదిరిగానే ఐజెఎస్ వస్తే రిజర్వేషన్ల అమలుతో పాటు రాజకీయ జోక్యం లేని న్యాయమూర్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. త్వరలోనే రాష్ట్రంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రాజకీయ పార్టీ ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో బిసి సంఘ నాయకులు కె.రమణమూర్తి, చంద్రరావు, జి.రమణమూర్తి, సనపల అన్నాజీరావు, డి.పి దేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


శ్రీనివాస్ పట్నాయక్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా-102 గవర్నర్ కె.సత్యం అధ్యక్షతన ఆదిత్య వాకర్స్ క్లబ్ వార్షిక సమావేశం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కోవిడ్ రోగులకు విశేష సేవలందించిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదిత్య వాకర్స్‌క్లబ్ ప్రారంభించి 12 ఏళ్లు పూర్తి చేసుకుందని అన్నారు. ఈ కాలంలో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, చలివేంద్రాల ఏర్పాటు, రథసప్తమి సందర్శకులకు పురిహోరాలు పంపిణీ, ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్టార్ వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ సమాజంలో ఈ సంఘం మంచి గుర్తింపు పొందిందని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బురిడి గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శాంతారాం, కోశాధికారిగా గణేష్‌స్వామి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రామజోగినాయుడు, కృష్ణ, ప్రభాకర్ పట్నాయక్, కృష్ణప్రసాద్, జాలీవాకర్‌గా ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా రథో, వెంకటరావు, కొండబాబులను ఎన్నుకున్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

ఆర్‌డిఒకు సిపిఎం వినతి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పలాస : వజ్రపుకొత్తూరు మండలం బెండి, నువ్వలరేవు, పలాస మండలం టెక్కలిపట్నం రోడ్ల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కెమోహనరావు, సిపిఎం నాయకులు ఎన్.గణపతి డిమాండ్ చేశారు. పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి నేటికి 15శాతం పనులు పూర్తి చేయలేదన్నారు. దీంతో అనేక మంది ఆ రోడ్డుపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము, ధూళి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఈ విషయాన్ని అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గ్రామాల్లో నిర్మిస్తున్న డ్రెయినేజీల్లో పశువులు పడిపోయి ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మంచినీటి కోసం వేసిన పైప్ లైన్లు తవ్వేయడంతో మంచి నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో కె.హేమసుధన్, కె.బాలాజీరావు, వి.కృష్ణారావు, కె.ఆనందరావు, ఎం.నరేష్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సాంబమూర్తికి సన్మానం


సాంబమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ఒలింపిక్ సంఘం కార్యర్శిగా ఎన్నికైన టిపిఎం స్కూల్ పీడీ మెంటాడ సాంబమూర్తిని నగరంలోని ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్ ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వ్యాయామ ఉపాధ్యాయునిగా విద్యార్థులకు ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. క్రీడాకారునిగా ఉంటూ ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగంలో చేరిన సాంబమూర్తి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పీడీ కె.మాధవరావు, ప్రభాకర్ పాణిగ్రాహి, ఎం.పద్మకుమారి, పి.భాగ్యలక్ష్మి, బి.తారాబాయి, టి.పురుషోత్తం, యోగా ఇన్‌స్ట్రక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

వజ్రపుకొత్తూరు : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి ప్రారంభం నుండి తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఇబ్బంది అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి అవసరమైతే ట్యాంకుల ద్వారా నీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ట్రాక్టర్లు అవసరమైన రైతు గ్రూపులు దరఖాస్తు చేసుకోవాలని ఎఒ కిరణ్మయి కోరారు. అంతకు ముందు సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం లేకపోవడంతో షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశంలో ఎంపిడిఒ సిహెచ్ ఈశ్వరమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైస్ ఎంపిపి వంక రాజు, అధికారులు, సర్పంచ్ మామిడి భాస్కర్‌రావు, మల్లేశ్వరరావు, వరదరాజు, అట్టాడ గోపి, రాజు, అంబటి శ్రీను, ఎంపిటిసిలు వెంకన్న, బాలక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌తో ప్రజా సేవ

గార పోస్టుమాస్టర్, ఎఐపిఇయు జిల్లా అధ్యక్షులు జ్యోతీశ్వరరావు


జాని జ్యోతీశ్వరరావు, పోస్టుమాస్టర్, గార

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామీణ ప్రాంతాల్లోని పోస్టాఫీసుల్లో పనిచేయడం ద్వారా పేదలకు సేవ చేసే అవకాశం లభించిందని గార పోస్టుమాస్టర్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్-సి) జిల్లా అధ్యక్షులు జాని జ్యోతీశ్వరరావు అన్నారు. దీంతోపాటు యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం ఉద్యోగ జీవితంలో చాలా సంతృప్తినిచ్చిందని చెప్పారు. ఈనెల 28న ఆయన ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా తన అనుభవాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు.

విద్యాభ్యాసం

కంచిలి మండలం బూరగాంలో జాని అప్పారావు, సావిత్రమ్మకు మూడో సంతానంగా 1963 ఫిబ్రవరి 15వ తేదీన జ్యోతీశ్వరరావు జన్మించారు. తండ్రి అప్పారావు కో-ఆపరేటివ్ వెల్ఫేర్ సొసైటీలో క్లర్క్‌గా పనిచేసేవారు. జ్యోతీశ్వరరావు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బూరగాంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోను, ఆరు నుంచి పదో తరగతి వరకు సోంపేట జిల్లాపరిషత్ హైస్కూల్‌లో విద్యనభ్యసించారు. ఇంటర్ సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ దూర విద్యలో చేశారు.

ఉద్యోగ జీవితం

పోస్టల్ శాఖలో 1983లో ఇచ్ఛాపురంలో ఆయన ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. ఏడాది పాటు అక్కడ పనిచేసిన ఆయన, బదిలీలో భాగంగా సోంపేట, బారువ, కొర్లాంలో ఐదేళ్లు పనిచేశానని తెలిపారు. కంచిలి మాణిక్యపురంలో నాలుగేళ్లు పోస్టల్ అసిస్టెంట్, సబ్ పోస్టుమాస్టర్ వంటి పలు హోదాల్లో పనిచేశారు. ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరులో పనిచేశారు. ప్రస్తుతం గారలో పనిచేస్తున్నారు.

ఉద్యమ నేపథ్యం

విద్యార్థి దశలోనే వామపక్ష, అభ్యుదయ భావాల వైపు ఆకర్షితులయ్యారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆ సమయంలో తన గ్రామంలో సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పనిచేశారు. దళితుల ఇళ్లకు వెళ్లడం, వారి బావి వద్ద వెళ్లి నీళ్ల తాగడం, వారిని ఉద్యమాల వైపు తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. యువతను కలుపుకొని గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేశారు. స్వగ్రామం, పరిసర ప్రాంతాల్లో వామపక్ష ఉద్యమంలో కొద్దిగానైనా తన పాత్ర ఉండడం గర్వంగా ఉందన్నారు. సత్యం మాస్టారు, అప్పటి పై నాయకత్వం సూచనలు మరింత ఉపయోగపడ్డాయని తెలిపారు.

యూనియన్‌లో చురుగ్గా...

పోస్టల్ యూనియన్‌లో జాతీయస్థాయి నాయకులు ఆదినారాయణ, కృష్ణన్, రాఘవేంద్రన్, ముత్యాలు వంటి వారి సహచర్యం యూనియన్‌లో మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ఆయనకు ప్రేరణగా నిలిచింది. ఉద్యోగ జీవితంలో చంద్రశేఖర్, సింహాచలం, డి.కె.నాయుడు, అప్పారావు, రఘురాం, గణపతి, బాబూరావు, నందికేశ్వరరావు అందించిన తోడ్పాటు మరువలేనిదని గుర్తు చేసుకున్నారు.

కుటుంబ నేపథ్యం

భార్య శ్రీదేవిని ఆదర్శ వివాహం చేసుకున్నారు. కుమారుడు వంశీ యూరప్‌లోని హంగేరిలో ఇన్‌కమ్ టాక్స్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. తనకు ఉద్యోగ, యూనియన్, వ్యక్తిగత జీవితంలో తన భార్య అందించిన సహకారం మరువలేనిదని చెప్పారు. గ్రామంలో నిర్వహించిన అన్ని కార్యక్రమాలకూ తన సోదరులు బాబూరావు, జయరాం అండగా నిలిచారని తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత వామపక్ష ఉద్యమ విస్తరణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నిస్వార్థంగా సేవలందించారు



జ్యోతీశ్వరరావు నిస్వార్థంగా సేవలందించి ప్రజలు, సహచరుల మన్ననలు అందుకున్నారు. అభ్యుదయ, సాంస్కృతిక కార్యక్రమాలు, యువజన సంఘం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. పోస్టల్ యూనియన్‌కే కాక ఇతర కార్మిక, ప్రజా సంఘాలకు సైతం సహాయ పడే చైతన్యపూరిత పాత్ర పోషించారు. ఆయన సోదరులు సైతం అభ్యుదయ ఉద్యమమార్గంలోనే తమ జీవితాలను మలుచుకోవడం విశేషం. ఉద్యోగ విమరణ ఉద్యోగానికే కానీ చురుకైన ఆయన కార్యక్రమాలకు కాదని అభిలషిద్దాం.

- వి.జి.కె మూర్తి, అధ్యక్షులు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం

జ్యోతీశ్వరరావు స్ఫూర్తి



నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్‌లో సాధారణ కార్యకర్త నుంచి డివిజనల్ ప్రెసిడెంట్ వరకూ ఎదిగారు. నిస్వార్థంతో సేవలందించి కొత్త తరానికి ఆదర్శంగా నిలిచారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో అలుపెరుగని పోరాటాలు చేశారు. ఉద్యోగ విరమణ చేసినా ఆయన సేవలు ట్రేడ్ యూనియన్‌కు, ప్రజా ఉద్యమాలకు ఎల్లప్పుడూ ఉంటాయని భావిస్తున్నాను.

- బి.శ్రీధర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి,
అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్-సి)

ప్రజా సేవలో ముందుంటారు



నాలుగు దశాబ్దాల పాటు తపాలా శాఖలో, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్‌లో సేవలందించారు. జ్యోతీశ్వరరావు ఉద్యోగంలో చేరిన నాటి నుంచీ సంఘంలో క్రియాశీలకంగా పనిచేశారు. సంఘంపై ఆయనకు ఉన్న గౌరవం, నమ్మకం నేటి తరానికి ఎంతో ఆదర్శం. ఆయన ఉద్యోగ విరమణ సంఘానికి తీరని లోటు. ప్రజా సేవలో మరింత ముందుండాలని కోరుకుంటున్నాను.

- కె.గణపతి,
పోస్టల్ ఉద్యోగుల సంఘ శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శి



ధర్నా చేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వై.మురళి, కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అనంతరం పలాస నియోజకవర్గ ఎఐవైఎఫ్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 55,667 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిస్సి నిర్వహించాలని కోరారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నేను ఉన్నాను నేను విన్నానని చెప్పి అధికారంలోకి రాగానే ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి నేటికీ మూడున్నరేళ్లు గడిపేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగం లేక నిరుద్యోగులు వలస వెళ్లిపోవాల్సి వస్తోందన్నారు.. సమావేశంలో ఎఐవైఎఫ్ పలాస నియోజకవర్గ అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శిగా జె.వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా బి.సాయి, పి.కిషోర్, ఉపాధ్యక్షుడిగా ఎం.సాయి, కమిటీ సభ్యులుగా హేమలరావు, ఆకాష్, దిలీప్, రవి, కార్తీక్, సిద్ధార్థలను ఎన్నుకున్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిపి గోపి

విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

ప్రజాశక్తి- జలుమూరు

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండి తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని ఎంపిపి వాన గోపి అన్నారు. సోమవారం మండలంలోని తలతరియ, జోనంకి సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే లబ్ధిదారులు, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు మండల సలహాదారుడు పైడి విత్రావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పొందూరు : స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను, వినతులను, సమస్యలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించేందుకు చొరవ చూపాలని తహశీల్దార్ ఎస్.రాంబాబు మండల అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం లో భాగంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను మూడు రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రామరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ మురళి, ఎఒ బెండు బాబ్జి, ఎపిఎం గురుగుబిల్లి శ్యామలరావు పాల్గొన్నారు.

దర్జా లేని దర్జీ బతుకులు

- విస్తరిస్తున్న రెడీమేడ్ రంగం
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు కరువు
- నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం

సమాజంలో సామాన్యుడు మొదలు అత్యున్నతస్థానం అలంకరించే అమాత్యులు, అధికారులు, సినీ కళాకారులు వరకు దర్జీ వృత్తిదారులతో సంబంధాలు ముడిపడి ఉంటాయి. కానీ, వారి నుంచి దర్జీలు ఆర్జించగలిగేది ప్రశంసలు మాత్రమే. దర్జీలకు వయసు మళ్లిన తర్వాత బతుకు బరువు కావడంతోపాటు సానుభూతి మాత్రం మిగులుతుందన్న ఆవేదన వ్యక్తం అవుతుంది.

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వాలెన్ని మారినా ప్రోత్సాహకాలు లేకపోవడంతో దర్జీల జీవితాలు దర్జాకు దూరం అవుతున్నాయి. ప్రత్యేకించి ప్రస్తుతం ప్యాషన్ రంగం విస్తరించడం, అందుకు ధీటుగా రెడీమేడ్ షోరూమ్‌ల ఏర్పాటుతో టైలర్స్ ఆర్థికాభివృద్ధికి దూరం అవుతున్నారు. ఏళ్ల తరబడి తమ హక్కుల కోసం, ప్రభుత్వ ఆదరణ కోసం ఆశగా ఎదురు చూస్తున్న టైలర్స్‌తో పాటు అదే వృత్తికి అనుబంధంగా ఉన్న కార్మికులు, మహిళలు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పది వేలకుపైగా స్త్రీ, పురుషులు, యువత టైలరింగ్ నే నమ్ముకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

కార్పొరేట్ పోటీ

ఫ్యాషన్స్‌పై యువత మోజు అన్ని వయసుల వారికి రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యాషన్ రంగం విస్తరించింది. టీషర్టు, జీన్స్ ప్యాంటు, షాట్‌లు రకరకాల దుస్తులు మార్కెట్లోకి వచ్చాయి. యువత ఆసక్తిని ఆదాయ వనరులుగా మార్చుకునేందుకు పెద్ద బ్రాండెడ్ కంపెనీలు నగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాలు గ్రామాలకు సైతం ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. దీంతో సామాన్యుడు సైతం స్టైల్ పట్ల ఆకర్షితుడై రెడీమేడ్ వైపు మక్కువ చూపడంతో టైలరింగ్ షాపుల మెట్లు ఎక్కేవారు క్రమేణా తగ్గిపోతున్నట్టుగా పలువురు టైలర్స్ వెల్లడిస్తున్నారు. మహిళలు సైతం నేడు పంజాబీ డ్రెస్, లెగిన్స్‌ప్యంట్లు, మగవారితో సమానంగా జీన్స్, టీషర్ట్స్ వినియోగంపై ఏ మాత్రమూ వెనుకడుగు వేయకపోవడంతో అంతా రెడీమేడ్ ప్రపంచంగా మారుతోంది. దీంతో ఆరు నెలల పని ఉంటే, మరో ఆరు నెలలు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దుస్తులు తయారీకు సంబంధించిన మెటీరియల్ ధరలు పెరుగుదలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఈ కారణంగా కుట్టు కూలి ఎక్కువ చేయాల్సిన దుస్థితి దర్జీ ఉపాధిగా మలుచుకుంటున్నారు. ప్యాంట్, షర్టు జత కుట్టు కూలి చెప్పుకునేందుకు రూ.600 అయినా... అవి తయారు చేసేందుకు రూ.400 లకు పైబడి ఖర్చు అవుతోంది. జత దుస్తులు ఇస్త్రీ చేయిస్తే రూ.20 తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇక షాపు అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లించి మిగిలేది కూలీ గిట్టుబాటే. రెక్కాడితేకాని డొక్కాడని దర్జీలు వృద్ధాప్యంలో కంటిచూపు కొరబడి అనారోగ్యానికి గురవడం సహజం. దీంతో సంబంధం లేని వృత్తులైన ఆటోడ్రైవర్లు, పరిశ్రమల్లో రోజు కూలీలుగా, సెక్యూరిటీ గార్డులుగా, వాచ్‌మెన్లు, పెయింటర్లు పనికి పోవాల్సిన పరిస్థితి ఉందని గోడు వెళ్లబోసుకుంటున్నారు. ప్రభుత్వం రూ.పది వేలు ఏటా ఇస్తుండడం కాస్త ఊరటనిస్తుందని అన్నారు.


దుస్తులను కుడుతున్న టైలర్

మహిళలకు స్వయం ఉపాధి

సామాన్య కుటుంబాలకు చెందిన మహిళలు ఎందరో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేందుకు స్వయం ఉపాధిగా టైలరింగ్‌ని ఎంచుకుంటున్నారు. ఇంటి పనులు చక్కదిద్దుకొని ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు గృహిణులకు టైలరింగ్ దోహదపడుతోంది. టైలరింగ్ చాలామంది మహిళలు స్వయం ఉపాధిగా మల్చుకోవడంతో మహిళలు దుస్తులు కూడా టైలరింగ్ వృత్తిని ఎప్పటినుంచే నమ్ముకుని చేస్తున్నవారికి మహిళలు దుస్తులు కూడా కుట్టడానికి రావడం లేదని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కుట్టు మిషన ఆవిర్భావం ఇలా...

పూర్వం సూది, దారం ఉపయోగించి చేతితో దుస్తులు కుట్టుకునేవారు. జర్మనికి చెందిన విలియమ్స్ చే తన భార్య చుస్తులు కుట్టుకునేందుకు పడుతున్న అవస్థలు గమనించాడు. 1846లో తన దేశంలో 11 నెలలు ఎంతో కష్టపడి ఫిబ్రవరి 28వ తేదీన కుట్టుమిషన్ను కనిపెట్టారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా కుట్టుమిషన్లు వినియోగ స్త్రీలోకి వచ్చాయి. అందువల్లనే ఫిబ్రవరి 28న ప్రపంచ వ్యాప్తంగా దర్జీల దినోత్సవం జరుపు కుంటారు.

డిమాండ్లు...

దర్జీలు ప్రభుత్వ ఆదరణ కోసం ఎదురు చూస్తున్నారు. టైలర్స్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నివాస స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు కేటాయించాలి. చేనేతల మాదిరిగానే 50 ఏళ్లకు పింఛన్లు, పిల్లల చదువులకు ఫీజుల చెల్లింపుల్లో రాయితీలు, టైలరింగ్ షాపులకు విద్యుత్తు ఛార్జీలు విధింపులో రాయితీ కల్పించాలని దర్జీ కళాకారులు కోరుతున్నారు.

జీవన భృతి వర్తింపజేయాలి


27 ఏళ్ల టైలరింగ్ వృత్తిని నమ్ముకునే జీవితం సాగిస్తున్నాను. రెడీమేడ్ దుస్తులతో మా వ్యాపారానికి తీవ్రంగా గండి పడింది. రెండున్నర దశాబ్దాలుగా పనిచేస్తున్నా మిగిలిందేమీ లేదు. పని ఉన్న సమయంలో వచ్చిన డబ్బులతోనే కుటుంబ అవసరాలు తీరుతాయి. పని లేకుంటే అప్పులు చేయాల్సిందే. బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు ఇచ్చినట్టు టైలర్లకు కూడా జీవనభృతిని వర్తింపజేయాలి. పిల్లలకు విద్యలో రాయితీ, అనారోగ్య సమస్యలకు వైద్యంలో రాయితీ అందించాలి. **- డి.వెంకటేష్, టైలరింగ్ సంఘ నాయకులు, జె.ఆర్.పురం**

సంక్షేమానికి కృషి చేయాలి


మూడు దశాబ్దాలుగా టైలర్‌గా పనిచేస్తున్నాను. రెడీమేడ్ దుస్తులతో గిరాకీ తగ్గింది. పని ఉన్నప్పుడు రోజుకు రూ.300 వరకు సంపాదిస్తున్నా టైలరింగ్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎలాంటి కృషి చేయడం లేదు. అర్హులైన పేదవారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ప్రభుత్వం ఆదుకోవాలి. బ్యాంకు రుణాలు అందిస్తే టైలరింగ్ రంగం రాబోయే రోజుల్లో కొంత మెరుగ్గా ఉంటుంది. టైలర్లకు సంక్షేమ పథకాలేవీ లేకపోవడం బాధాకరం. **- బుడుమూరు రామకృష్ణ, కృష్ణాపురం**

రెడీమేడ్ రాకతో పని తగ్గింది


మా కుటుంబం తరతరాలుగా కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తోంది. నేను ఇరవై ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నారు. గతంలో చేతినిండా పని ఉండేది. రెడీమేడ్ దుస్తుల రాకతో పరిస్థితి మారింది. మాకు పనిదొరకడం లేదు. చేయడానికి పనిలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ఈ వృత్తిపై ఆధారపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. **- ఎ.గోవింద్, టైలర్, రణస్థలం**

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

ప్రజాశక్తి- విజయనగరం

ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర చాలా కీలకమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. ప్రతి అంశాన్నీ సునిశితంగా పరిశీలించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియమించిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నియమావళి, అనుసరించాల్సిన నిబంధనలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి సూక్ష్మ పరిశీలకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళిని ప్రతిఒక్కరూ తు.చ తప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశంపైనా సూక్ష్మ పరిశీలకులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలు సరికావన్నారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి విషయాన్నీ ఎన్నికల పరిశీలకులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఎన్నికల సరళి, ఇతర అంశాలపై నివేదిక అందజేయాల్సి ఉంటుందన్నారు.

కళ్లూ.. చెవులు వంటి వారు

సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల సంఘానికి కళ్లు, చెవులు వంటి వారని ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ అభిప్రాయపడ్డారు. వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడుతూ ప్రతి దశలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత ఉన్నతాధికారులకు గానీ, తనకి గానీ తెలియజేయాలని సూచించారు. ఆయా జిల్లా కలెక్టర్లు పరిశీలకులకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలన్నారు. సంబంధిత మెటీరియల్, హ్యాండ్ బుక్స్ అందించాలని చెప్పారు. సదస్సులో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మలత, ఎన్నికల సెల్ అధికారులు, సిబ్బంది, పలువురు తహశీల్దార్లు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

విప్రోకు సంస్కార భారతి విద్యార్థుల ఎంపిక


దివ్యవాణి శృతి

సోంపేట: సంస్కార భారతి విద్యాసంస్థలకు చెందిన డి.దివ్యవాణి, టి.శతి విప్రో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి తెలిపారు. సామాన్య, మధ్య తరగతికి చెందిన విద్యార్థినులు ఐటి ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. విప్రో సంస్థకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.దాసు, చైర్మన్ వై.దేవరాజు, డైరెక్టర్ శ్రీనుబాబు, ఎఒ పాపారావు, కవిబాబు అభినందించారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ఆక్రమణలను వెంటనే తొలగించాలని బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ సూరపనాయుడు కోరారు. ఈ మేరకు పట్టణంలోని కూరగాయల మార్కెట్ ముందర బాగాన ఉన్న ఖాళీ స్థలంలో పెట్టిన ఐదు బడ్డీలను, అలాగే పట్టణ నడిబొడ్డున ఉన్న పాల బంద చెరువు గర్భంలో అక్రమంగా పెడుతున్న షాపులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమంగా నెలకొల్పిన బడ్డీలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పైడి ఏకాంబరేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చింతాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భారీగా విరాళాలు వచ్చి చేరుతున్నాయి. జలుమూరు మండలం చల్లపేటకు చెందిన తంగుడు వెంకటరమణయ్య, గోవిందమ్మ దంపతులు సోమవారం అరసవల్లిని సందర్శించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఇఒ కార్యాలయంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర రావును కలిసి నిత్యాన్నదాన పథకం నిర్వహణకు రూ.1,01,116 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటి వద్దకే వైద్య సేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రమేష్‌నాయుడు

పొందూరు: గ్రామాల్లో ఇంటివద్దకే అందజేస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాడివలస పిహెచ్‌సి డాక్టర్ బి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని కొంచాడలో ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు, బాలింతలకు, మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్.పుష్ప, ఎఎన్ఎం వై.స్వాతి, ఆశా కార్యకర్తలు సుశీల, పద్మావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ పంపిణీ

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని మూడో వార్డు ఊసవానిపేటకు చెందిన కపిరి వరుణ్‌కు ఎంఇఒ దుప్పల రామారావు భవిత కేంద్రం వద్ద ట్రై సైకిల్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని లక్ష్మీనగర్ హైస్కూల్‌లో వరుణ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడని తెలిపారు. వికలాంగులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎపిఎం పైడి కూర్మారావు, సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, ఎస్.గోవిందరావు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి

పలాస: వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో చదువుతున్న ప్రీతి సీనియర్ల ర్యాగింగ్‌కు బలైందని, ఆమె మృతికి కారకులను శిక్షించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌ను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లను అరికట్టాలని, ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలను పటిష్టంగా నడిపించాలని, సీనియర్, జూనియర్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించి స్నేహ పూర్వకంగా మెలిగేలా చేయాలని వినోద్ తెలిపారు.

గృహ సారథులు కీలకం

నందిగాం: గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు బాధ్యతతో పని చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాపు తెంబూరు సచివాలయంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ మాట్లాడుతూ దేశానికి పల్లెలు ఎంత ముఖ్యమో గ్రామాలకు గృహ సారథులు అంతే ముఖ్యమని అన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జగనన్న సచివాలయాల మండల ఇన్‌ఛార్జి జడ్యాడ జయరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పోలాకి మోహనరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కె.ధర్మారావు, ఎంపిపి ఎర్ర చక్రవర్తి, టి.ఫల్గుణరావు, ఎం.గోపాలకృష్ణ, తమిరి బలరాం, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామం వద్ద సోమవారం ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. గ్రామస్తులతో పాటు మెళియాపుట్టి, పట్టుపురం, లింగుపురం, మర్రిపాడు తదితర గ్రామాలతో పాటు సరిహద్దు ఒడిశా వాసులు సైతం ఎల్లమ్మ జాతరలో పాల్గొని ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఏడాదికి ఒకసారి జరిగే ఈ ఉత్సవాలకు యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ టి.రాజేష్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు.

జామి జాతర ఏర్పాట్లు పరిశీలన

పలాస: ఎల్లమ్మ గుడి వద్ద బుధవారం జరగనున్న జామి జాతర ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పరిశీలించారు. ఎల్లమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలు వచ్చే దారి, వెళ్లే దారి వేర్వేరుగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అనంతరం ఎల్లమ్మ తల్లిని సందర్శించారు. వారితో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, ఎల్లమ్మ జాతర నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్ క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్లిక్కర్ కార్డ్‌తో అన్‌లైన్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. డిస్‌ప్లేలో చూపి క్విజ్‌ను ఓ గేమ్‌లా నిర్వహించారు. విజేతలకు జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయడం జరుగుతుంది తెలిపారు.. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు రోబిన్ కుమార్‌పాడి, అధ్యాపక బృందం జెన్న, రామకృష్ణ, సంతోష్‌కుమార్, దుర్యోధన, శివకష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

కాళీమాత ఆలయం పున: ప్రతిష్ట

ఇచ్ఛాపురం: పట్టణంలోని డబ్బీరు వీధిలో దక్షణ కాళీ మాత ఆలయ పున: ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు వీధుల ప్రజలు బాహుదా నది నుంచి నదీ జలాలను మేళ తాళాలతో ఊరేగింపుగా తెచ్చారు. పురాతన దేవాలయం పున: ప్రతిష్టను అరసవల్లి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ చేశారు. ఆలయ కమిటీ భారీ ఏర్పాట్ల నడుమ పున: ప్రతిష్ట జరిగింది.

బ్యాంకు సేవలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బ్యాంకు ఆర్థిక సేవలపై ప్రజలకు, ఖాతాదారులు అవగాహన కలిగి ఉండాలని ఎపి గ్రామీణ వికాస్ బ్యాంకు పూండి శాఖ మేనేజర్ డి.మహేష్ కోరారు. సోమవారం ఉద్దానం గోపీనాథపురం పంచాయతీ సర్పంచ్ కర్ని శ్రీను అధ్యక్షతన ఉద్దానం మెలియాపుట్టి గ్రామంలో బ్యాంకు ఆర్థిక సేవలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు అతి తక్కువ రుసుంతో సామాజిక పథకాలు అందిస్తున్నామని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన ప్రధానమంత్రి జీవిత సురక్ష యోజన పథకాల కోసం ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకానికి సంబంధించిన సొమ్మును ఇటీవల కిడ్నీ వ్యాధితో మరణించిన బత్సల కామరాజు భార్య పద్మకు రూ.2 లక్షల చెక్కును కర్ని శ్రీను, గ్రామ పెద్దలతో కలిసి అందజేశారు. కర్ని శ్రీను మాట్లాడుతూ వివిధ రకాల సామాజిక భద్రత పాలసీల ఆవశ్యకతను వివరించారు. అవగాహన లేక గ్రామంలో చాలా మంది రైతులకు రైతు రుణాలు లేవన్నారు. ప్రైవేటు అప్పుల వల్ల రైతులు అధిక వడ్డీ భారంతో సతమతమవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.శ్రీను గ్రామపెద్దలు జోగారావు, కె.మోహన్‌రావు, భీమారావు, ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్ ప్రశాంత్, ఏరియా మేనేజరు టి.బాలరాజు, కె.తిరుపతిరావు, విఒ ఎ.కర్ని రాజేశ్వరి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


పొందూరు : అవగాహన కల్పిస్తున్న అరుణ్‌కుమార్

పొందూరు: నగదు రహిత లావాదేవీలు ఎంతో సురక్షితమని తాడివలస ఎపిజివిబి మేనేజర్ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తాడివలసలో సోమవారం స్వయం శక్తి సహాయక మహిళా సంఘాల సభ్యులకు సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు అందజేసే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. బ్యాంకు ద్వారా అందజేసే వివిధ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు, బీమా సేవలపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో గోకర్ణపల్లి సర్పంచ్ చింతాడ మాధురి, ఎంపిటిసి మాజీ సభ్యులు చింతాడ వెంకటసత్యనారాయణ ప్రసాద్, క్యాషి యర్ రాజశేఖర్, సిఎఫ్ సరస్వతి పాల్గొన్నారు.

ఆర్మోర్ మిరప సాగుతో అధిక దిగుబడి



అనందరావును సన్మానిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రంలో ఆర్మోర్ మిరపసాగుకు ప్రత్యేక స్థానం ఉందని, ఇది తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుందని టెర్రిటోరి వ్యవసాయ మెనేజర్ సిహెచ్ రాజేష్ అన్నారు. సోమవారం రాష్ట్ర బృందం ఈ పంటల పరిశీలనకు మండలానికి వచ్చారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా ఈ పంటను శ్రీజగన్నాథపురం గ్రామానికి చెందిన సాసుమంతు ఆనందరావు సాగు చేశారు. ఈ పంట ఘననీయంగా దిగుబడివచ్చిందని, సాధారణ మిరప సాగు కంటే ఆర్మోర్ మిరప అన్ని విధాల శ్రేయస్సు అని, అన్నిరకాల వాతావరణానికి నిలబడి ఎటువంటి వ్యాధులకు గురికాకుండా రైతుకు లాభం చేకూర్చుతుందని ఆయన వివరించారు. గతంలో ఈ పంట గుంటూరు, కృష్ణ, రాయలసీమ, వరంగల్ ప్రాంతాల్లో ఎక్కువగా పండించేవారని, ఇప్పుడు సాసుమంతు ఆనందరావు వంటి రైతులు దీనిని గుర్తించి ఉత్తరాంధ్రలో వ్యాప్తి చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆనందరావుకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సేల్స్ ఎడ్యుకేషన్ డి.గోపినాథ్, ఎఫ్‌డిఒ ఎం.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ వైశ్య సంఘం అధ్యక్షులుగా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం అధ్యక్ష పీఠాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రతినిధి కోట్ని దుర్గాప్రసాద్ సొంతం చేసుకున్నారు. కాశీబుగ్గ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఓటింగ్ నిర్వహించారు. ఎన్నికల్లో 473 ఓట్ల మెజార్టీతో కోట్ని దుర్గాప్రసాద్ కాశీబుగ్గ వైశ్య సంక్షేమ సంఘానికి అధ్యక్షునిగా గెలుపొందారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి కాశీబుగ్గ వైశ్య సంఘం అధ్యక్ష పీఠానికి జరిగే ఎన్నికల్లో భాగంగా 2023-2025 ఏడాదికి కాశీబుగ్గ వైశ్య సంక్షేమ సంఘం ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

అధ్యక్ష స్థానానికి జరిగే ఎన్నికల్లో కాశీబుగ్గ వైశ్య సంఘానికి చెందిన కోట్నీ దుర్గాప్రసాద్, సిందిరి మధు, దేవరశెట్టి బాలాజీతో పాటు కోట్నీ రమేష్ నామినేషన్లు వేశారు. రమేష్ తన నామినేషన్‌ను వెనక్కి తీసుకోవడంతో అధ్యక్ష స్థానానికి ఎన్నికల బరిలో ముగ్గురు నిలిచారు. ఈ ఎన్నికల్లో 787 మంది సంఘ సభ్యులు పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం జరిగిన లెక్కింపులో కోట్ని దుర్గాప్రసాద్‌కి 593 ఓట్లు రాగా దేవరశెట్టి బాలాజీకి 60 ఓట్లు, సిందిరి మధుసూదన్ కి 120 ఓట్లు సంపాదించుకున్నారు. 14 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. గెలుపొందిన వెంటనే కోట్ని దుర్గాప్రసాద్ మంత్రి అప్పలరాజుని ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కోట్ని దుర్గాప్రసాద్‌ని పలాస వైశ్య సంఘ పెద్దలు, వైసిపి నేతలు అభినందనలు తెలిపి, సత్కరించారు.


దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న మంత్రి అప్పలరాజు

'ఎంజిఆర్' పరామర్శ


పరామర్శిస్తున్న గోవిందరావు

పాతపట్నం : మండలంలోని తామరకు చెందిన మాజీ జర్నలిస్టు కూర్మాపు రామారావు తండ్రి సింహాచలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు సోమవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే పాతపట్నం మాజీ సర్పంచ్ లింగాల జనార్ధనరావు తమ్ముడు, డెంటల్ డాక్టర్ వైకుంఠరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపిఆర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయన వెంట టిడిపి నాయకులు ఎంజిఆర్ సభ్యులు ఉన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన ఉర్లానా అన్నయ్య, గేదల చంద్రమ్మ మృతి చెందారు. వారి కుటుంబాలను ఎంజిఆర్ సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బందపల్లికి చెందిన సచివాలయ లైన్ మాన్ సవర సుదర్శన్ ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురవడంతో ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదిస్తే తన వంతు సహాయం చేస్తానని అన్నారు. పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు అత్తయ్య జానకమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరావు, మామిడి గంగాధర్, పలువురు నాయకులు, ఎంజిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.


బోరు తవ్విస్తున్న తులసీ శంకర్

సొంత నిధులతో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 30వ వార్డు ఉదయపురంలో కొంతకాలంగా నీటి కొరతతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక టిడిపి కౌన్సిలర్ డొక్కరి తులసిశంకర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాలకవర్గంతో పాటు మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఏమి చేయలేక పోయారు. వార్డు ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో కౌన్సిలర్ ప్రతినిధి డొక్కరి శంకర్ తన స్నేహితుడు, తన సొంత నిధులతో కలిసి బోరు తవ్వించారు. దీంతో వార్డు ప్రజలు డొక్కరి శంకర్‌తో పాటు ఆయన స్నేహితునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తలగాన మోహన్, మనిగాం మోహన్, జోగ శ్రీను, కొనరి రాఘవ, రాలి రాజు, కె.కృష్ణ పాల్గొన్నారు.

సెక్టోరియల్ బృందం పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని చాపర, కోసమాల ప్రాథమిక పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ సెక్టోరియల్ టీం సోమవారం పరిశీలించింది. విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల మౌలిక సదుపాయాలు, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజన పథకం, తదితర అంశాలపై పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తనిఖీల్లో సిఎంఒ ఎస్.హరికృష్ణతో పాటు ఎంఇఒ దేవేంద్రరావు, చాపర, కోసమాల హెచ్‌ఎంలు కుమారస్వామి, కె.గున్నయ్య ప్రభావతి, జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న హరికృష్ణ